క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట పూజ



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో కొత్తగా నిర్మిస్తున్న ఆలయంలో తిరుమల వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట పూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ఊరేగింపు పుర వీధుల గుండా ఆలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయంలో విగ్రహాన్ని ప్రత్యేక పూజల ద్వారా ప్రతిష్టించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, సోమ్‌నాథ్‌నాయక్, బాల్యానాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతినిధిగా నియమించడంపై హర్షం

వీపనగండ్ల: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మల్లు రవిని నియమించడంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, ఎత్తం కృష్ణయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, పోతుల వెంకట్‌రెడ్డి రాజశేఖర్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్సీకి కంప్యూటర్లు



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి కొత్త కంప్యూటర్లు వచ్చారు. గతంలో ఒకటి రెండు కంప్యూటర్లే ఉండగా, ప్రభుత్వం నుంచి ఒకేసారి ఆరు కంప్యూటర్లు వచ్చాయి. వీటి ద్వారా పని మరింత సులువువయ్యేలా అస్కారం ఏర్పడిందని కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు విద్యా అంశాల సమాచారాన్ని రూపొందించేందుకు ఇంతకాలం రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. తాజాగా కార్యాలయాన్ని అదనపు కంప్యూటర్లు రాకతో ఆ ఇబ్బంది తొలగనుందని వారు పేర్కొన్నారు.

విద్యార్థికి అభినందనలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బత్తుల చరణ్‌తేజ వనపర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టులో ప్రథమ స్థాయిలో నిలవడంతో పలువురు అభినందించారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థి జిల్లా స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు రెడ్డి, గణితం ఉపాధ్యాయుడు కృష్ణ అభినందనలు తెలియజేశారు. జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన, ఈ నెల 29న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నాడు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అమరచింత: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత పోటీలలో పట్టణానికి చెందిన తస్లిమాబేగం పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాల నుంచి జిల్లా స్థాయి గణిత పోటీలకు ముగ్గురు ఎంపిక య్యారని వీరిలో రాష్ట్ర స్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం హర్షనీయమని హెచ్‌ఎం బలరాముడు తెలిపారు.

విద్యార్థినికి సన్మానం

పెబ్బేరు రూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ లీగ్ పోటీల్లో ఝాన్సి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, మాస్టర్ వరుణ్ సోమవారం వనపర్తి మండలం, చిట్యాలలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో పోతు శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పెబ్బేరు రూరల్: హైదరాబాద్ వెళ్తానని చెప్పిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే శ్రీరంగాపురం మండల కేంద్రానికి కేశపాగ బాలు హైదరాబాద్‌లో పనికోసం 17వ తేదీన ఇంటి నుంచి బయలుదేరాడు. కానీ అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసిన పనిచేయడం లేదు. దీంతో సోమవారం తండ్రి కేశపాగ బాలస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

ప్రశ్నించడమే నాస్తికత్వం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సాంఘికపరమైన అసమానలతను ప్రశ్నించడమే నాస్తికత్వమని జిల్లా గౌరవ అధ్యక్షుడు మైత్రియాదయ్య అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంగళగిరిలో వచ్చేనెల రెండో శనివారం, ఆదివారాల్లో జాతీయ నాస్తిక మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



అరేపల్లిలో భాజాభజంత్రీలతో శోభాయాత్ర



ఆత్మకూర్‌లో భారీ ర్యాలీ



ఆత్మకూర్‌లో మహిళల కోలాటం

ఊరూరా శోభాయాత్రలు, పూజలు



తెల్లరాళ్లపల్లితండాలో కోలాటం

ఆత్మకూర్: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం, బాలరామచంద్ర విగ్రహ ప్రతిష్టాపన, ప్రాణప్రతిష్ట సందర్భంగా ఊరూర పండుగ వాతావరణం సంతరించుకుంది. సోమవారం ఉదయం నుంచి పట్టణంలోని పురవీధులగుండా సీతా, రామ, లక్ష్మణల విగ్రహమూర్తుల భారీ శోభాయాత్రను మహిళల కోలాటం నడుమ నిర్వహించారు. స్థానిక బాలబ్రహ్మేశ్వరస్వామి స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం భారీ ఎల్‌ఈడీని ఏర్పాటు చేయడంతో వేలాదిగా భక్తులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

గ్రామాలన్నీ రామమయం

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు గ్రామాలన్నీ రామమయంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, రాముల వారి విగ్రహాల ఊరేగింపు శోభాయాత్రలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని దేవాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెబ్బేరు పట్టణ కేంద్రంలోని రామాలయం వద్ద ఎల్‌ఈడి స్క్రీన్‌ల ద్వారా అయోధ్యలో చేస్తున్న కార్యక్రమాని ప్రత్యక్ష ప్రసారంలో భక్తులు వీక్షించారు. శ్రీరంగనాథాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కంబాళాపురంలోని ఆలయంలో భక్తులకు టీవి ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని చూశారు.

వీపనగండ్ల: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో సోమవారం దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూంకుంట దేవాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు తిలకించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో రాముల వారిని ఊరేగించారు. కుమ్మరి గేరి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అప్పారెడ్డిపల్లిలో రాముల వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మానాజీపేటలో సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపాల్‌పేట: ఉమ్మడి మండలంలో రాములోరి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం నుంచి బస్టాండులోని చెన్నకేశవ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు.



మూలమల్లలో రాములవారి శోభాయాత్ర

మదనాపురం: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి ఆయన సతీమణి కవిత పాల్గొని ప్రాత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం చేపట్టారు.

అమరచింత: పట్టణంలోని రామలయంలో సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో భజన కార్యక్రమాలను చేపట్టారు. ఆలయంలో అయోధ్య రామాలయంకు సంబంధించిన రంగులతో చక్కటి ముగ్గును మహిళలు వేశారు. సాయంత్రం శోభాయాత్రలో పట్టణ ప్రజలతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రామజన్మ భూమిలో అప్పట్లో కరసేవకులుగా వెళ్లిన వారికి సన్మానించారు. పట్టణంలోని శివాజీ నగర్‌లో అయోధ్య రామమందిర చిత్రాన్ని రంగు రంగుల ముగ్గులతో అలంకరించి దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.



వివిధ వేషధారణలో చిన్నారులు



పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లిలో ఊరేగింపు



అమరచింత రామాలయంలో అయోధ్య రామయ్య దేవాలయం ముగ్గు



ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటలో..



అమరచింతలో శోభాయాత్ర



తూంకుంట దేవాలయంలో వీక్షిస్తున్న గ్రామస్తులు



ఖిల్లాఘనపురంలో రాముల వారి పల్లకీసేవ నిర్వహిస్తున్న గ్రామస్తులు



చెన్నారంలో భజనలు చేస్తున్న భక్తులు



పాన్‌గల్‌లో ప్రత్యేక పూజలో భక్తులు



పెబ్బేరులో శోభాయాత్ర



సూగూరు ఆలయంలో భక్తులు

ఘనంగా హాజీమలాంగ్ బాబా ఉర్సు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు.

అమరచింత: మండలంలోని మస్తీపురం గుట్టలపై వెలిసిన సయ్యద్ షా హాజీమలాంగ్ బాబా ఉర్సు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొబ్బరికాయలను, మలీదాను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం కందూర్లకు పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకునే భక్తులు ఈసారి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన ఉండటంతో దర్గా పరిసరాల్లో జంతుబలిని నిషేధించారు. భక్తులు సైతం స్వచ్ఛందంగా కందూర్లను వాయిదా వేసుకుని దర్గా షరీఫ్‌లో ప్రత్యేక ఫాతెహా కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. ఉత్సవాల్లో మతసామరస్యం వెల్లివిరిసిందని దేశంలో నివసించే ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలుగుతున్నారని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



ఉర్సుకు హాజరైన భక్తులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఖిల్లాఘనపురం: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విజయ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం తాగునీటిపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్న వాటి వివరాలను చెప్పాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది గుర్తించాలని పేర్కొన్నారు. వేసవి రాకముందే ప్రణాళిక ప్రకారం ముందుకు వెళితే ఎక్కడ సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవీందర్, ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగుడెంలో శనివారం నాగపురి ఆంజనేయులు ఎద్దులు గుంతలోపడి చనిపోయాయి. ఈ సందర్భంగా సోమవారం పెద్దగుడెం ఎంపీటీసీ కురుమూర్తి రూ.5వేలు, మాజీ సర్పంచ్ జానకి రూ.5వేలు, ఎర్వ సాయియాదవ్ రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సురేష్, అంజి, చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్లలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న సరోజమ్మకు టీపీసీసీ అధికారప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ రూ.10వేలు అందజేశారు. సోమవారం వారి నివాసానికి వెళ్లి సరోజమ్మ యోగక్షేమాలను తెలుసుకుని మెరుగైన వైద్య చికిత్సలకు సహకరిస్తామని కుటుంబ సభ్యులకు భరోసనిచ్చారు. ఆయన వెంట అరుణ్‌కుమార్, కృష్ణకాంత్, మన్మోహన్, శ్రీకాంత్, రంజిత్, సీమోన్, గ్రామస్తులు ఉన్నారు.

గ్రామస్తులకు అవగాహన

మదనాపురం: సామాజిక విజ్ఞాన కళాశాల, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన బీఎస్సీ డిగ్రీ విద్యార్థినులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ కార్యక్రమం ద్వారా గ్రామీణ కుటుంబ స్థితిగతులపై అధ్యాయనంలో భాగంగా మండలంలోని నెలివిడిలో కేవీకే శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రవేఫ్ విద్యార్థినులు అంగన్‌వాడీ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రంగులు సహజ వనరుల ద్వారా వచ్చే వాటిని తెలియజేశారు. కార్యక్రమంలో మేఘన, రసజ్ఞ, రచన, సుష్మ, చరన్య, గీత, పావని, మోహిని తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

టీబీపై అప్రమత్తత అవసరం



పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారి, సర్పంచ్



గోపాల్‌పేట ఆస్పత్రి ఆవరణలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వీపనగండ్ల: టీబీని ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చని మండల వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంతో పాటు సంగినేనిపల్లి గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించారు. అనంతర వికసిత్ భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. భార్గవి, సర్పంచ్ నర్సింహారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ప్రతి ఒక్కరూ టీబీపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని డాక్టర్ కృష్ణకుమారి అన్నారు. సోమవారం ఆమె తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉండటం, రాత్రిసమయంలో చెమటలు పట్టడం, ఆకలి కాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానికంగా ఉండే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సువర్ణ, శివలింగం, శ్రీనివాసులు, డప్పునరసింహ, కృష్ణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

వీపనగండ్ల: పంచాయతీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవ్వాలంటే సమష్టి పోరాటాలు నిర్వహించాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు రాజబాబు అన్నారు. ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మహేష్, ఎల్లమ్మ, గంగమ్మ, ఈశ్వరయ్య, ఆనందమ్మ, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న పంచాయతీ వర్కర్లు

పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అమరచింత: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించేందుకు డీఎంఆర్ఎం ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్ తెలిపారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు సోమవారం అల్పాహారం అందించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్యాం, సుశీల, వైదూర్య, శారద పలువురు పాల్గొన్నారు.